
క్లుప్తంగా

గుకేష్‌కు చిత్ర నీరాజనం



వెంకటేష్ తీర్చిదిద్దిన గుకేష్ చిత్రం

కాకినాడ రూరల్: సింగపూర్‌లో జరిగిన చెస్ ప్రపంచ చాంపియన్ షిప్‌లో విజేతగా నిలచి భారతావని నీరాజనాలందుకుంటున్న దొమ్మరాజు గుకేశ్‌కు కాకినాడకు చెందిన చిత్ర కళాకారుడు, ఏపీఐఐసీ అటెండర్ వెంకటేష్ చిత్ర నీరాజనం పలికారు. గుకేష్ చిత్రాన్ని అందంగా తీర్చిదిద్ది సోషల్ మీడియాలో పెట్టడంతో పలువురిని ఆకట్టుకుంటోంది.

రేపు చలో గుంటూరు



మాలల మహాగర్జన పోస్టర్‌ను విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

కాకినాడ క్రైం: ఆదివారం అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో మాలల మహాగర్జన నిర్వహించనున్నట్లు రాష్ట్ర కన్వీనర్ సిద్ధాంతుల కొండబాబు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం కాకినాడలో ఓ హోటల్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. హలో మాల ఛలో గుంటూరు పేరుతో నిర్వహించనున్న ఈ సభకు మాలలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ క్రీమీలేయర్ తీర్పును రద్దు చేయాలన్న డిమాండ్‌తో గుంటూరులో నల్లపాడు రోడ్‌లో హౌసింగ్ బోర్డు కాలనీలో సీతారామ టౌన్‌షిప్ ఎదురుగా సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మాలల మహాగర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. సమావేశంలో జేఏసీ వర్కింగ్ ఛైర్మన్ పండు అశోక్‌కుమార్, రాష్ట్ర కన్వీనర్ ఏనుగుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలాబత్తినకు గద్దర్ జాతీయ పురస్కారం



శ్రీనివాసరావుకు సేవారత్న పురస్కారాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

కాకినాడ సిటీ: జిల్లా హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పోలాబత్తిన శ్రీనివాసరావుకు గద్దర్ జాతీయ పురస్కారం, సేవారత్న పురస్కారాలు దక్కింది. ఈయన మానవ హక్కులపైన అవగాహన కల్పించడం, రోడ్డు పక్కన ఆకలితో అలమటిస్తున్న అనాథలకు ఆహార పదార్థాలు అందించడం, సమాజంలో చేస్తున్న సేవలను గుర్తించి ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ పురస్కారం శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో మమత స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గద్దర్ జాతీయ పురస్కారాన్ని ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తెలంగాణకు చెందిన గద్దర్ కుమార్తె ఉమ్మడి వెన్నెల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మమతా స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపకుడు కోరుకొండ జాన్ తదితరులు పాల్గొన్నారు.

నడకుదురులో రెవెన్యూ సదస్సు

కరప: భూ సమస్యలు పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. మండలం నడకుదురులో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. భూవిస్తీర్ణం హెచ్చు, తగ్గులపై సర్వేచేయాలని కోరుతూ 14, పాస్ పుస్తకం కోసం ఒకటి, పైపులైన్ తవ్వేశారంటూ రెండు దరఖాస్తులు వచ్చినట్టు తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. నడకుదురులో స్థలం కొనుగోలుచేసి ఇల్లు కట్టుకున్నానని ఏడాదిగా విద్యుత్ స్తంభంవేసి, విద్యుత్ సరఫరా చేయలేదని తెప్పల విజయలక్ష్మి పేర్కొన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులతో పాటు, అధికారులు పాల్గొన్నారు.

విక్టరీ వెంకటేష్ జన్మదిన వేడుకలు



'సంక్రాంతికి వస్తున్నాం' క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అభిమానులు

కాకినాడ సిటీ: సినీ హీరో విక్టరీ వెంకటేష్ జన్మదిన వేడుకలు కాకినాడ తిరుమల థియేటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే వచ్చే ఏడాది విడుదల కానున్న 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సురేష్ సంస్థ ప్రతినిధులు నారాయణ, శంకర్ అభిమానులు బాలు, నరసింహం, రాము, సత్తిబాబు, మేస్త్రి రాజు, శివ, చిన్ను, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్‌భవ

- 70 ఏళ్లు పైబడిన వారికి ఉచిత ఆరోగ్య బీమా
- ఏడాదికి రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం
- ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా అమలు
- రూరల్, సిటీ నియోజకవర్గాల్లో 39,960 మంది వృద్ధులకు లబ్ధి
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యానికీ అవకాశం

అర్బన్‌లో యూపీహెచ్‌సీలు :	23
రూరల్‌లో పీహెచ్‌సీలు :	5
70 ఏళ్లు పైబడిన వృద్ధులు :	39,960 మంది

కాకినాడ సిటీ: ఆస్పత్రి పాలైతే కూడబెట్టుకున్నదంతా కరిగి పోవాల్సిందే. ఖరీదైన వైద్యం వల్ల అప్పుల పాలైన కుటుంబాలు ఎన్నో. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే ముందస్తు ఆరోగ్య బీమాయే సరైన మార్గం. వృద్ధాప్యంలో ఆరోగ్య బీమా ప్రీమియం పెద్ద మొత్తంలో ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో 70 ఏళ్లు నిండిన వృద్ధులందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఇప్పటి వరకు ఈ పథకం కింద పేద, తక్కువ ఆదాయ వర్గాలకే ఉచిత ప్రయోజనం అందుతోంది. ఇకపై ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులకు పీఎంకేఏవై కింద రూ.5 లక్షల వరకు నగదు రహిత హెల్త్ కవరేజీ లభిస్తోంది.

ఉచిత బీమా

- పీఎంజేఏవై పథకాన్ని 2018లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. పేద కుటుంబాలకు ఈ పథకం కింద ఆరోగ్య సేవలు అందుతున్నాయి.
- 70 ఏళ్లు పైబడి, ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా రూ.5 లక్షల ఆరోగ్య బీమా అందుబాటులోకి తెచ్చింది.
- అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడానికి మూడు రోజుల ముందు వరకు అయ్యే వైద్య పరమైన ఖర్చులకు సైతం నగదు రహిత కవరేజీ ఉంటుంది.
- చికిత్స సమయంలో మందులు ఉచితంగా అందిస్తారు.
- గుండె సంబంధ వ్యాధులకు అమర్చే స్టంట్లు, ఐసీయూ, జనరల్ వార్డుల్లో ఉండి పొందే చికిత్సకు బీమా వర్తిస్తుంది.
- రోగికి చికిత్స సమయంలో భోజనం ఉచితంగా అందిస్తారు.
- ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత 15 రోజుల పాటు చికిత్సకు అయ్యే ఖర్చులకు చెల్లింపులు అందుతాయి.
- ఈ పథకం కింద ఇప్పటికే వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి ఆయుష్మాన్ కార్డులు జారీ చేశారు.
- ప్రస్తుతం 70 ఏళ్లు నిండిన వృద్ధులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఎంజేఏవై.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని ఆయుష్మాన్ కార్డు పొందవచ్చు.



సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం తెచ్చిన పీఎంజేఏవై ఆరోగ్య బీమాను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే పేదలందరికీ ఈ పథకం కింద రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతోంది. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి కార్డులు జారీ చేశాం. తాజాగా ఆర్థిక, ఆదాయ పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులకు ఈ పథకం వర్తింప జేస్తున్నారు. వీరికి కూడా రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకునే వెసులుబాటును కేంద్ర కల్పించింది.

– జె నరసింహనాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

చీడిగలో ఐక్య గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న పాస్టర్లు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం చీడిగలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో యునైటెడ్ పాస్టర్స్ ప్రేయర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 13వ ఐక్య గ్రాండ్ క్రిస్మస్ నిర్వహించారు. అసోసియేషన్ ఫౌండర్ బి దివాకర్ మాట్లాడుతూ క్రీస్తు రాజ్యాన్ని లోకానికి చాటి చెప్పాలనే తపనతో సేవకులను ఒకే మార్గంలో నడపుతున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి సేవకులు డీజే సామ్యూల్ సాగర్, బిషప్ జోసఫ్ బెన్నీ, సీరం ఐజాక్, జాషువా గిరి, ఇస్సాక్, మోషే తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాజానగరం జీఈవో మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు రెవరెండ్ జి.దేవ సహాయం క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. పేదవారికి నూతన వస్త్రాలను, చిన్నారులకు బహుమతులను అందజేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి క్యాండిల్ లైట్స్ సర్వీస్‌తో శుభాకాంక్షలు తెలిపారు.

రేపు అమరజీవి వర్ధంతి

కాకినాడ సిటీ: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా పాటిస్తూ నివాళులర్పించనున్నట్టు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు కాకినాడ సీబీఎం స్కూల్ రోడ్డు, ఫెలోషిప్ చర్చి సెంటర్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్టు కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

- బకాయిదారులకు నోటీసులు ఇవ్వండి
- కమిషనర్ భావన ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యేందుకు నగర అభివృద్ధికి దోహదపడే పన్నుల వసూలు విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దని, పన్ను బకాయిదారులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆస్తి, నీటి పన్నుల బకాయిలు, నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్సులోని దుకాణాల అద్దె బకాయిల విషయమై కమిషనర్ భావన శుక్రవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పన్ను వసూలు విషయంపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు అడ్మిన్ కార్యదర్శులు కార్యాచరణ రూపొందించుకుని ఆస్తిపన్ను బకాయిలు రూ.20 కోట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, బకాయిదారులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. పన్నులు తక్కువ వస్తున్న వాటిని సవరించాలని సూచించారు. రూ.15 కోట్ల మేర ఉన్న నీటి పన్ను బకాయిలను కూడా వసూలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు అద్దె చెల్లించకుండా బకాయిపడ్డ వారికి నోటీసులు ఇవ్వడంతో పాటు, ఆ షాపులను సీజ్ చేయాలని కమిషనర్ ఆదేశించారు. పన్ను వసూళ్లలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి వారం ఈ విషయంపై సమీక్షిస్తామన్నారు. పురోగతి కనిపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, రెవెన్యూ అధికారులు కోట శిరీష్‌కుమార్, నిర్మలాకుమారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బీచ్ పార్కు పనులు పూర్తిచేయాలి

కాకినాడ రూరల్: కాకినాడ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ పార్కును కొడా వైస్ చైర్‌పర్సన్, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ భావన శుక్రవారం సందర్శించారు. బీచ్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను, యుద్ధ విమాన మ్యూజియంను పరిశీలించారు. ఈనెల 20న బీచ్ పార్కులో జరగనున్న ఉత్సవాల నాటికి రోడ్డు, డివైడర్ మధ్య గ్రీనరీ, ఆర్చ్ తదితర పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. యుద్ధ విమాన మ్యూజియం సందర్శకులకు అనుమతికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆమె వెంట కొడా కార్యదర్శి కాశీబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: అవుట్ సోర్సింగ్ ద్వారా మున్సిపాలిటీలో 25 ఏళ్లుగా పని చేస్తున్న 14 వేల మంది కార్మికులు ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తలపెట్టిన సమ్మె శుక్రవారం 5వ రోజుకు చేరుకుంది. కాకినాడ విక్టోరియా వాటర్ వర్క్స్ బయట రామారావుపేట రోడ్డులో 225 మంది కార్మికులు చేస్తున్న సమ్మెకు పౌరసంక్షేమ సంఘం నాయకులు దూసర్లపూడి రమణరాజు మద్దతు తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. 25 ఏళ్లుగా వాటర్ వర్క్స్ ఇన్‌డోర్‌లో 32 మంది అవుట్‌డోర్‌లో 21 మంది, వీధి దీపాల నిర్వహణలో 18 మంది, సెక్యూరిటీలో 50 మంది, పార్కు మజ్దూర్‌గా 52 మంది, వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా 15 మంది, వికాస్ నుంచి కాంట్రాక్ట్ వర్కర్స్‌గా 14 మందితో పాటు కంప్యూటర్ ల్యాబ్ అనలిస్టుగా తదితర అనేక మంది పని చేస్తున్నారని వారందరి సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బత్తుల శివశంకర్, తుమ్మలపల్లి శ్రీధర్, శంభుప్రసాద్, యక్కల శ్రీనివాస్, కుడిపూడి వీరభద్రరావు, సత్యనారాయణ, జాడ అప్పలరాజు, పి నగేష్, వై.శ్రీనివాస్, పి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు మరిన్ని సేవలు అందించాలి



ఇఫ్కో జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే నానాజీ

బోట్‌క్లబ్: రైతులు, మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్స్ కో–ఆపరేటివ్ (ఇఫ్కో) సంస్థ పనిచేయాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. స్థానిక గొడారిగుంట దుర్గాదేవి ఆలయం వద్ద శుక్రవారం ఆ సంస్థ కాకినాడ జిల్లా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఇఫ్కో పీడీ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇఫ్కో సంస్థ అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 56 వేల మహిళా బృందాలకు స్వయం ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి సహకరిస్తున్నామన్నారు. వారి జీవనోపాధికి ఉపయోగపడేలే వివిధ రకాల వస్తు ఉత్పత్తి శిక్షణ పరిశ్రమల స్థాపనకు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. మండల కో–ఆర్డినేటర్లు ఇఫ్కో మహిళలకు, రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ నారాయణశెట్టి సాయికుమార్, ఇఫ్కో డైరెక్టర్లు పాల్గొన్నారు.

రుణాల లెక్క తేల్చండి

- వీఓఏపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు డ్వాక్రా మహిళల ఫిర్యాదు



ఎంపీడీఓ సతీష్‌కు ఫిర్యాదు చేస్తున్న డ్వాక్రా మహిళలు

కాకినాడ రూరల్: మండలంలోని పి.వెంకటాపురం గ్రామంలోని డ్వాక్రా సభ్యుల సొమ్ములను వీఓఏ కనకమహాలక్ష్మి దుర్వినియోగం చేసినట్టుగా 28 డ్వాక్రా సంఘాల ప్రతినిధులు ఎంపీడీఓ సతీష్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అన్ని గ్రూపులను నిర్వహిస్తూ ఇష్టం వచ్చిన వారికి రుణాలు ఇస్తూ లెక్కలు చెప్పకుండా తానే సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేస్తున్నట్టు ఆరోపించారు. డ్వాక్రా రుణ సొమ్ములు గ్రూపు సభ్యులకు ఇస్తానని డ్రా చేసి, వాటిలో రూ.5 లక్షలు ఆటోలో పోయినట్టు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, మిగిలిన సొమ్ములను తీసుకునేందుకు డ్వాక్రా సభ్యులు చెప్పారన్న సాకుతో వాటిని బ్యాంకులో జమ చేయకుండా వడ్డీకి ఇచ్చినట్టు చెప్తున్నారని వారు ఆరోపించారు. ఈ అంశాలపై విచారణ జరిపి న్యాయం చేయాలని డ్వాక్రా మహిళలు ఎంపీడీఓను కోరారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టరుకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశామని మహిళలు తెలియజేశారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ వెలుగు అధికారులను విచారణ చేపట్టాలని కోరుతామన్నారు. వెలుగు ఇన్‌చార్జి ఏపీఎం సత్యనారాయణ స్పందిస్తూ తమకు అందిన ఫిర్యాదు మేరకు సీసీ ద్వారా విచారణ నిర్వహిస్తామన్నారు.

వైభవంగా హనుమద్వ్రతాలు

- ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో హనుమద్వ్రతంలో పాల్గొన్న భక్తులు



కరప విష్ణ్వాలయంలో స్వామివారికి క్షీరాభిషేకం



వడమాల అలంకరణలో సూర్యారావుపేట సీతా రామస్వామి ఆలయంలోని స్వామివారు

బోట్‌క్లబ్: నగరంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమద్వ్రతం సందర్భంగా శుక్రవారం ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వయంభువుగా వెలిసిన ఆంజనేయస్వామి వారికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించారు. నాగవల్లీ దళాలతో గంధ సింధూర పూజ, వడమాల కైంకర్యం నిర్వహించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ ఆలయంలో ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక ఎల్‌బీ నగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమద్వ్రతం సందర్భంగా విశేష పూజలు చేశారు. స్వామి వారికి తమలపాకుల పూజ, గంధ సింధూర పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక కొండయ్యపాలెంలోని ఆంజనేయస్వామికి ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వీటితో పాటు స్థానిక దేవాయంవీధిలోని ఆంజనేయ స్వామి ఆలయం, జగన్నాథపురంలోని ఆంజనేయ స్వామి ఆలయంతో పాటు పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి తమలపాకు పూజ నిర్వహించారు.

కరపలో..

కరప: స్థానిక విష్ణ్వాలయంలోని అభయాంజనేయ స్వామికి అర్చకులు పెద్దింటి గోపాలకృష్ణ, సూర్యానారాయణ ఆధ్వర్యంలో, పేపకాయలపాలెం అభయాంజనేయస్వామి ఆలయంలో వేదపండితుడు కప్పగంతు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో, వలసపాకలలో అర్చకులు కొక్కిరిగడ్డ మణికంఠ ఆధ్వర్యంలో భక్తులతో వ్రతాలు చేయించారు. కరప జ్యోతిషాలయంలో సువర్చలా సహిత పంచముఖ ఆంజనేయునికి గాధావర్జుల కొండయ్యసిద్ధాంతి ఆధ్వర్యంలో లక్షసింధూర అర్చన, అభిషేకాలు, హోమం నిర్వహించారు. నడకుదురు, పెనుగుదురు, అరట్లకట్ట, వేళంగి తదితర గ్రామాల్లో స్వామి వారికి సింధూర, లక్ష నాగవల్లీ దళాలతో, లక్ష తమలపాకుల అర్చన, సూర్యనమస్కారాలు, లింగార్చన, హోమం నిర్వహించారు.

కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్: మండలంలోని పలు ఆంజనేయ ఆలయాల్లో శుక్రవారం హనుమద్వ్రతాలు ఘనంగా జరిగాయి. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శ్రీ అభయాంజనేయ ఆలయం వద్ద జరిగిన వ్రతాలలో 108 దంపతులు పాల్గొన్నారు. స్వామి వారికి లక్షపత్రి పూజ నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ముమ్మిడి కామరాజు, చౌదరి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు. రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో అర్చకుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో హనుమద్వ్రతాలు నిర్వహించారు.

డయల్ యువర్ డీఎంకు మూడు ఫిర్యాదులు

కాకినాడ సిటీ: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమంలో ప్రజల నుంచి మూడు సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని, వీటిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ ఎంవీ మనోహర్ తెలిపారు. పెదపూడి గ్రామానికి చెందిన హరికృష్ణ కాకినాడ నుంచి జి.మామిడాడ, రాయవరం మీదుగా రావులపాలేనికి బస్సు తిప్పాలని కోరారన్నారు. అలాగే పందలపాక గ్రామానికి చెందిన రామచంద్రమూర్తి కాకినాడ నుంచి రావులపాలెం, వాడపల్లికి జి.మామిడాడ, పందలపాకల మీదుగా నడపాలని కోరారన్నారు. కాకినాడకు చెందిన ఖండవల్లి వీరభద్రరావు కాకినాడ ప్రతాప్‌నగర్ బ్రిడ్జి వద్ద రాజమహేంద్రవరం నాన్‌స్టాప్ బస్సులకు స్టాపు, కౌంటర్ సదుపాయం కల్పించాలని కోరినట్లు డీఎం వివరించారు.

పాఠశాలకు డెస్క్‌ల బహూకరణ



డెస్క్‌లను ప్రారంభిస్తున్న కెనరా బ్యాంక్ డీజీఎం శ్రీనివాసరావు

కరప: కెనరా బ్యాంక్ ఖాతాదారులకే కాకుండా సామాజిక సేవలూ నిర్వహిస్తోందని ఆ బ్యాంకు డీజీఎం నక్కా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆ బ్యాంకు సీఎస్సార్ నిధుల నుంచి రూ.3 లక్షలు విలువైన 42 డెస్క్‌లను ఆర్ఎం ఆర్.గణేష్‌తో కలసి ఆయన బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు పాఠశాలకు డెస్క్‌లు కావాలని కోరడంతో ఈ నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏపీసీ సమగ్ర శిక్ష అధికారి, డిప్యూటీ కలెక్టర్ పి.వేణుగోపాలరావు పాఠశాల తరపున డీజీఎం శ్రీనివాసరావు, ఆర్ఎం గణేష్‌లను సత్కరించారు. ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ, బ్యాంక్ డివిజనల్ మేనేజర్ ఏకే మహంతి, ఎంఈఓ పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'లో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు శుక్రవారం ఉచిత వైద్య సేవలను అందించారు. పీజీ సెంటరు ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీదేవి, హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ శిబిరాన్ని ప్రిన్సిపాల్ కమలకుమారి ప్రారంభించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు వైద్యులు వసంత్‌కుమార్, లక్ష్మీ ప్రవీణ, భాగ్య సుధ, అభిషేక్, దివ్య వైద్య సేవలందించారు. వైస్ ప్రిన్సిపాల్ పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ అధికారుల ఫోన్ నెంబర్లు

మున్సిపల్ అధికారులు	
కమిషనర్	9100945696
అదనపు కమిషనర్	9849907096
డిప్యూటీ కమిషనర్	9949921555
ఏసీపీ	9989743049
ఎంహెచ్‌వో	9949432320
ఎస్ఈ	9959988639
మేనేజర్	7093519888
టీపీఆర్వో	9701385284
అకౌంట్ ఆఫీసర్	9849907084
సిటీ మిషన్ మేనేజర్	7901610084
పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు	
డివిజనల్ పంచాయతీ అధికారి	9849903188
ఫుడ్ ఇన్‌స్పెక్టర్	9494297564
ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ	9100121109
జిల్లా వ్యవసాయశాఖాధికారి	8331056483
దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్	9290145126
గృహ నిర్మాణశాఖ డీఈ	7093930577
పశుసంవర్ధకశాఖ జేడీ	9989932835
డీసీసీబీ జీయం	8341208227
జిల్లా సహకారశాఖ అధికారి	9100109168
జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు	
సూపరింటెండెంట్	98499 03870, 0884 2302001
సీఎస్ ఆర్ఎంవో	98499 03871
డీసీఎస్ ఆర్ఎంవో	98499 03871
ఆర్ఎంవో	0884 2302003
డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్	0884 2302002
అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)	98499 03873, 0884 2302004
పోలీస్ అవుట్‌పోస్ట్	83329 57924
అత్యవసర విభాగం	0884 2302021
బ్లడ్ బ్యాంక్	0884 2302009
మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ)	0884 2302018

సమాచారం

పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల	0884-2379480
జేఎన్‌టీయూ కళాశాల	0884-23800823
జిల్లా ఉపాధి కార్యాలయం	0884-2373270
ఐటీఐ కళాశాల	0884-2348182
ఏయూ దూరవిద్యాకేంద్ర	0884-2383788
జిల్లా రవాణాశాఖాధికారి	9154294104
జిల్లా విద్యాశాఖాధికారి	9849909104
స్కిల్ డవలప్‌మెంట్ కార్యాలయం	8500885866